# ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

బీబీపేట్, మే 19 : రైతులు ఆయిల్ పామ్ పంటను సాగు చేసుకొని మంచి దిగుబడులు సాధించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులు వరి పంటకు బదులు ఆయిల్ పామ్ పంటను సాగు చేసి అధిక దిగుబడితోపాటు ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో కూలీల ఖర్చు తక్కువని, డ్రిప్ ఇరిగేషన్‌తో సాగుచేయవచ్చని సూచించారు. దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ.. ఉద్యావన శాఖ ద్వారా ఆయిల్ పామ్‌కు ఎకరానికి 4,200 సబ్సిడీ రూపంలో నాలుగు సంవత్సరాలు అందజేస్తారని తెలిపారు. డ్రిప్ కూడా ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు వివరించారు. హిందూస్థాన్ యూనిలీవర్ మల్టీ నేషనల్ కంపెనీ నుంచి విచ్చేసిన అధికారులు వరణ్, విజయ రామస్వామి మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మించడానికి కసరత్తు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేసుకుని లాభాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఆర్ఐ రాము, నాయకులు సుతారి రమేశ్, వెంకట్‌రావు, శ్రీనివాస్, పలువురు రైతులు, హిందూస్తాన్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

**ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి**

కామారెడ్డి, మే 19 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 96 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల్లో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు


కానిస్టేబుల్ వడ్ల రవి భార్య సౌఖ్యకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి, మే 19 : కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ వడ్ల రవి ములుగు జిల్లా వాజేడులో ఆపరేషన్ కగార్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మందుపాతర పేలి మృతి చెందాడు. దీంతో ఇచ్చిన మాట ప్రకారం కారుణ్య నియామకాల్లో భాగంగా వడ్ల రవి భార్య సౌఖ్యకు, అలాగే అనారోగ్యంతో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రమేశ్ కుమార్తె మానసకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రాలను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడుతల వారీగా కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఉద్యోగాల్లో నియమితులైన సౌఖ్య, మానసకు అభినందనలు తెలుపుతూ నిజాయితీగా విధులు నిర్వహిస్తూ డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏవో ఎండీ.అఫ్సర్, సూపరింటెండెంట్లు గంగాధర్, జామిల్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి, మే 19 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. దేవునిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కల్కినగర్‌లో నీళ్ల సాయినాథ్ కిరాయికి ఉంటున్నాడు. ఈ నెల 18వ తేదీన రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి వెళ్లాడు. సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటికిరాగా.. ఇంటి తలుపులు పగులగొట్టి కనిపించాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులగొట్టి రెండు బంగారు నెక్లెస్‌లు, కొంత నగదును దొంగతనం చేశారని తెలిపారు. తన ఇంటిపై పోర్షన్‌లో ఉన్న పెంటయ్య ఇంట్లో కూడా చోరీ చేశారు. సాయినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## లింగంపేటలో వర్షం


లింగంపేటలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

లింగంపేట, మే 19 : మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం గంటపాటు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘాలు కమ్ముకుని ఉన్నాయి. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మండల కేంద్రంతోపాటు ఐలాపూర్, కోమట్‌పల్లి, రాంపల్లి, పోతాయిపల్లి, అన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోను భారీ వర్షం కురిసినట్లు గ్రామీణ ప్రాంత ప్రజలు తెలిపారు.

## కేసుల విచారణను పకడ్బందీగా చేపట్టాలి

కామారెడ్డి, మే 19 : కేసు విచారణను పకడ్బందీగా చేపట్టాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో స్టేషన్ రైటర్లు, సీఐ, డీఎస్పీ ఆఫీస్ రైటర్లతో ఎస్పీ సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తు, విచారణ, పరిశోధనను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవుతుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు ప్రతి కేసులో ఎంతో ప్రభావం చూపుతాయని అన్నారు. తప్పుడు వాంగ్మూలాలు లేదా నేరస్తులకు అనుకూలంగా ఇచ్చే స్టేట్‌మెంట్లు కేసుకు భంగం కలిగిస్తాయని అన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జీషీట్ వరకు అన్ని వివరాలు సమగ్రంగా, స్పష్టంగా నమోదు చేయాలని చెప్పారు. బాధితుడికి న్యాయం జరిగేలా విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ మురళి, ఇతర పోలీసు అధికారులు, రైటర్లు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న పోలీసులు, రైటర్లు

## గ్రామాల్లో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్


కోర్పోల్ గ్రామంలో నమోదు చేస్తున్న ఏఈవో

లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్, మే 19 : లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఆయా క్లస్టర్లలో విధులు నిర్వహిస్తున్న ఏఈవోలు గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని కన్నాపూర్, పోల్కంపేట, ముంబాజీపేట, కోర్పోల్, లింగంపేట, పర్మళ్ల తదితర గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 18 వేల మంది రైతులు ఉండగా సోమవారం నాటికి రెండు వేల మంది వరకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నిర్వహించినట్లు వ్యవసాయ విస్తీర్ణాధికారి సతీశ్ తెలిపారు. మండలంలోని అల్మాజిపూర్‌లో ఏఈవో రవీందర్, వెల్లుట్లలో ఏఈవో రాజాగౌడ్, ఎల్లారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో ఏఈవో ముఖీద్‌లు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు.

## తెరుచుకోని గ్రంథాలయం

లింగంపేట, మే19: లింగంపేట మండల కేంద్రంలోని గ్రంథాలయం తెరుచుకోకపోవడంతో నిరుద్యోగ యువకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో విధులు నిర్వహించే గ్రంథపాలకుడు రాకపోవడంతో తెరుచుకోలేదని పాఠకులు తెలిపారు. 20 రోజుల వ్యవధిలో టెట్ పరీక్షలు ఉన్నందున గ్రంథాలయానికి వచ్చారు. గ్రంథాలయం మూసి ఉండడంతో నిరసన వ్యక్తం చేశారు. గ్రంథాలయం తెరవకపోవడంపై లైబ్రేరియన్ మల్లారెడ్డిని వివరణ కోరగా ఆడిట్ ఉన్నందున కామారెడ్డికి వెళ్లినందున తీయలేదని సమాధానం ఇచ్చారు.


లింగంపేట శాఖ గ్రంథాలయం

## ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే


పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే సురేందర్, బీఆర్ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, మే 19 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే సురేందర్ సోమవారం సందర్శించారు. పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నాయకులు సిద్ధయ్య, దుర్గారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఫరీద్, బీసీ సంఘం నాయకులు కిష్టయ్య, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదాలు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి, మే 19 : స్కూల్ బస్సులు ప్రమాదాలు గురికాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని విద్యా సంస్థల యజమానులతో జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత మూడేండ్లల్లో స్కూల్ బస్సు ప్రమాదాలు తక్కువగా జరిగాయన్నారు. ఈ ఏడాది కూడా స్కూల్ బస్సు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు, యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్కూల్ బస్సులను తగిన మరమ్మతులు చేసుకొని ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు, సహాయ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్స్, హోంగార్డు, స్కూల్ యజమానులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, మే 19 : కూలి పనికి వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గుస్క సిద్ధిరాములు బతుకుదెరువు కోసం కూలీ పనులు చేసుకునే వాడు. మే 17వ తేదీన ఉదయం 6.30 గంటలకు ఇంట్లో పనికి వెళ్తున్నట్లు చెప్పాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కోసం కుటుంబ సభ్యులు వెతుకగా ఆచూకీ లభించలేదు. అతడి భార్య గుస్క దుర్గావేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


బిచ్కుంద మండలం దేవాడ గ్రామం వద్ద సోమవారం వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారి పక్కన పొలాల్లో జింకలు కనిపించాయి. అటుగా వెళ్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆ జింకలను చూసి తన ఫోన్‌లో ఫొటోలు తీశారు.

– బిచ్కుంద, మే 19

## ఇందిరమ్మ గృహాలకు మార్కింగ్

లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్/బీబీపేట్, మే 19 : లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి మార్కింగ్ చేశారు. ప్రభుత్వం నుంచి గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. లబ్ధిదారుల ఖాళీ స్థలాల్లో మార్కింగ్ చేశారు. మండలంలోని లింగంపేట, సజ్జన్‌పల్లి, శెట్పల్లిసంగా రెడ్డి, కన్నాపూర్, పోల్కంపేట, మెంగారం తదితర గ్రామాల్లో అధికారులు మార్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మలహరి మాట్లాడుతూ.. లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులతోపాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కింగ్ చేసినట్లు ఎంపీడీవో ప్రకాశ్ తెలిపారు. శివ్వాపూర్ గ్రామానికి ఐదు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా సోమవారం ఓ ఇంటికి కొలతలు కొలిని మార్కింగ్ చేశామన్నారు. ఆయనతోపాటు పంచాయతీ సెక్రటరీ, గ్రామస్తులు ఉన్నారు. బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో నాయకులు, అధికారులు కలిసి ముగ్గుపోశారు. బీబీపేట మండలం మాందాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేశ్, పాత రాజు, భూమాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్‌కుమార్, చింతకుంట రాకేశ్‌రెడ్డి, రోడ్డ రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిలెటిన్‌ను స్టిక్స్ నిర్వీర్యం చేసిన పోలీసులు


జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

లింగంపేట, మే 19 : లింగంపేట మండలం భవానీపేట గ్రామంలో సోమవారం జిలెటిన్ స్టిక్స్‌ను నిర్వీర్యం చేశామని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన దర్శనం సిద్ధిరాములు తన వ్యవసాయ పొలంలో అనుమతి లేకుండా బండరాళ్లు పేల్చడంతో ద్విచక్ర వాహనంతోపాటు రెండు నివాస గృహాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందం సభ్యులు ఆదివారం సాయంత్రం గ్రామాన్ని సందర్శించారు. చీకటి కావడంతో సోమవారం ఉదయం పోలీసు అధికారులు గ్రామానికి చేరుకున్నట్లు తెలిపారు. కాగా సోమవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకులు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది బండరాళ్లలో అమర్చిన జిలెటిన్ స్టిక్స్ గుర్తించి వాటిని బయటికి తీసి నిర్వీర్యం చేసినట్లు పోలీసులు తెలిపారు. బండరాళ్లలో అమర్చిన జిలెటిన్ స్టిక్స్ పేలి ఉంటే పక్కన ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రమాదం సంభవించేదని గ్రామస్తులు తెలిపారు. ఒక డిటోనేటర్‌తో పాటు రెండు జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఘటనలో పొలం యజమాని దర్శనం సిద్ధిరాములు, బండరాళ్లు పేల్చడానికి వచ్చిన రమేశ్, నర్సింహులుతో పాటు జేసీబీ డ్రైవర్ మంజ సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, లింగంపేట ఎస్సైలు వెంకట్రావ్, రాఘవేంద్ర, పోలీసు సిబ్బంది ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## కరెంట్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట, మే 19 : మండలంలోని భవానీపేట గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పిన్నూరి లక్ష్మణ్‌కు చెందిన గేదె మేత కోసం గ్రామ శివారులోని పంట పొలాల్లోకి వెళ్లిన సమయంలో బోరు మోటరుకు విద్యుత్ సరఫరా చేసే తీగలు తగిలి మృతి చెందినట్లు తెలిపారు. విద్యుత్ షాక్‌తో గేదే మృతి చెందిన విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించగా లైన్‌మన్ పాండు సందర్శించినట్లు తెలిపారు. కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

## కల్లు దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

బీబీపేట్, మే 19 : బీబీపేట, దోమకొండతోపాటు మాందాపూర్, మల్కాపూర్, ఇస్సానగర్, యాడారం, కోనాపూర్, ఉప్పుర్‌పల్లి, ముత్యంపేట, అంబారీపేట, గొట్టిముక్కల తదితర గ్రామాల్లో ఉన్న కల్లు దుకాణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించినట్లు భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

నాగిరెడ్డిపేట, మే19: నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయం లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణికి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రజావాణి ప్రారంభించగా ఐకేపీ ఏపీఎం జగదీశ్, వ్యవసాయ శాఖ అధికారి సాయి కిరణ్, హెల్త్ సూపర్‌వేజర్ మాత్రమే వచ్చారన్నారు. ఉదయం 11:30 గంటల తరువాత మరో నలుగురు అధికారులు హాజరు అయినట్లు తహసీల్దార్ తెలిపారు. పీఆర్ ఏఈ ప్రజావాణికి గైరాజరు అయినట్లు చెప్పారు. అధికారులు తప్పకుండా సకాలంలో ప్రజావాణికి హాజరుకావాలని ఆయన సూచించారు.


ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

## బీఆర్ఎస్ పార్టీ నాయకుల సన్మానం


సంపత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

లింగంపేట, మే 19 : తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. ఐలాపూర్ గ్రామంలోని సంపత్‌గౌడ్ నివాసంలో కలిసిన పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మ్యాకలకాడి రాములు, నాయకులు సందీప్‌గౌడ్, పోకల మల్లయ్య, బెస్త సంతోష్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

## సుందరయ్యకు ఘన నివాళి


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రామారెడ్డి(గాంధారి), మే 19 : గాంధారి మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి, సభ్యుడు మోతీరాం నాయక్ మాట్లాడుతూ.. సుందరయ్య తన బాల్యం నుంచి కుల వివక్ష, దోపిడీ వ్యవస్థను ఎదిరించిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కిషన్‌రావు, మధు, గిరిజన సంఘం కార్యదర్శి ప్రకాశ్, సాయిలు, వసంత్‌రావు, రాములు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ధిక్కరణకు పాల్పడితే జైలుకే..


ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, మే 19 : కోర్టు పేషీలకు హాజరుకాని వారు కోర్టు ధిక్కరణకు పాల్పడిన వ్యక్తులుగా పరిగణించబడతారని, అలాంటి వ్యక్తులు తప్పనిసరిగా జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ హెచ్చరించారు. సోమవారం ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో నిందితులుగా ఉన్న లింగంపేట్ మండలం రాంపూర్ తండాకు చెందిన ధరావత్ రమేశ్, బాన్సువాడ మండలం కొయ్యగుట్టకు చెందిన మక్కల గంగారాం కొన్ని రోజులుగా కోర్టు పేషీలకు హాజరుకావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వారిపై కోర్టు మెజిస్ట్రేట్ వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు జారీ చేశారన్నారు. ఈ వారెంట్‌లను అమలు చేస్తూ ఎల్లారెడ్డి పోలీసులు నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపరిచారన్నారు. విచారణ అనంతరం మెజిస్ట్రేట్ ఇద్దరు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

## లక్కీడ్రా ద్వారా 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక

ఎల్లారెడ్డి రూరల్, మే 19 : లక్కీ డ్రా ద్వారా 'డబుల్' బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మిగిలిన 40 డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇవ్వడానికి విచారణ పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. అర్హత ఉన్న లబ్ధిదారుల సంఖ్య ఇండ్ల కంటే ఎక్కువగా ఉన్నందునా త్వరలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయడానికి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

## కామారెడ్డిలో తిరంగ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న స్థానిక నాయకులు

కామారెడ్డి, మే 19 : భారత సైనిక దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కాటిపల్లితోపాటు స్థానిక నాయకులు మురళీధర్‌గౌడ్, నీలం చిన్న రాజు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు 'డయల్ యువర్ డీఎం'

కామారెడ్డి, మే 19 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం కరుణశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనల కోసం కామారెడ్డి డివిజన్ 9959226018, బాన్సువాడ డివిజన్ 9959226020 ఫోన్ నంబర్లకు డయల్ చేసి తమ విలువైన సూచనలు, ప్రయాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్న వారు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి


బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాన్సువాడ, మే 19 : పట్టణంలో అనుమతులు లేని పాఠశాలలు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘురాం కోరారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అనుమతులేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌వో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జీవన్, ఎఫ్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్, ఏఐఎస్ఎఫ్ బాన్సువాడ మండల కన్వీనర్ వంశీ, ఏఐఎస్ఎఫ్, ఎల్ఎస్‌వో తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**PASSPORT LOST**
★ I, Nagaram Srinivas S/o. Nagaram Narsaiah, H.No.2-5, Vill: Badguna, Mdl: Nandipet, Dist. Nizamabad. T.S. Has lost my Original **Passport No. 8263381**. While Travelling from Badguna Village to Nandipet Village. if any one found pls. cont: 9010662027
NTZ-338447

**WANTED**
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.